క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళాలు



దాతలకు స్వామి చిత్రపటాలను అందజేస్తున్న దేవస్థానం సిబ్బంది

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవగోపాలస్వామి ఆలయ అన్నప్రసాద పథకానికి భక్తులు విరివిగా విరాళాలు అందచేస్తున్నారు. దానిలో భాగంగా ఆదివారం ఆకివీడు గ్రామానికి చెందిన సమయమంతుల నాగవేంకట శ్రీనివాస్ రూ.25,116, సమయమంతుల రాజ మేధాశౌరి రూ.10,116 విరాళంగా సమర్పించారు. దాతలకు దేవస్థానం తరపున అధికారులు వేదపండితులతో ఆశీర్వచనం చేయించి, స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

విఘ్నేశ్వరస్వామి ఆలయానికి..



దాత మురళీధర్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న ప్రధానార్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి న్యూఢిల్లీకి చెందిన జోత్స్వాని మురళీధర్ రూ.20,232, ఏలూరుకు చెందిన మొలుగు హనుమంతరావు, రాధా దంపతులు రూ.10 వేలు విరాళంగా ఆదివారం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేద మంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

పుష్కర యాత్రికుడికి ఘన సత్కారం



చొప్పెల్లలో పుష్కర యాత్రికుడు చౌక దేను ఘనంగా సత్కరిస్తున్న భక్తులు

ఆలమూరు: గ్రామ శివారు దేవీ కాలనీకి చెందిన నిత్య యాత్రికుడు తలశిల సాయి నరేంద్ర (చౌక డే)కు ఆదివారం ఘన సత్కారం జరిగింది. ఇటీవల ఉత్తరాఖండ్‌లోని దేశ భూభాగమైన మనా గ్రామంలో నిర్వహించిన సరస్వతి పుష్కరాలకు ద్విచక్ర వాహనంపై వెళ్లి క్షేమంగా తిరిగి వచ్చిన చౌక డేకు మండలంలోని చొప్పెల్లలోని కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన 11 పుష్కరాలకు తన బైక్‌పై వెళ్లి పుణ్యస్నానం చేసినట్లు యాత్రికుడు చౌక డే తెలిపారు. భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మికతను పెంపొందిస్తూ సనాతన సంప్రదాయాలను గౌరవిస్తూ దేశ ప్రతిష్టను ఇనుమడింప జేసే విధంగా యాత్రలు చేపట్టిన చౌక దేను పలువురు భక్తులు అభినందించారు. యలమంచిలి బుచ్చిరాజు, పిల్లా నారాయణమూర్తి, సుంకర మురళి, కొత్తూరు పెదకాపు, బళ్ల బాబి, మురకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నవోదయ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



ర్యాలిలో నవోదయ ఎంట్రన్స్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న శ్యాంకుమార్

కొత్తపేట: నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆత్రేయపురం మండలం ర్యాలి అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించారు. ప్రముఖ మనస్తత్వవేత్త, ర్యాలి మండల ప్రజా పరిషత్ ప్రధాన ఫౌండేషన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యాంకుమార్ స్థానిక మ్యాజిక్ హౌస్‌లో శిక్షణ ప్రారంభించారు. చిన్నారులకు చేతివేళ్లతో లెక్కలను క్షణాల్లో ఎలా వేయవచ్చో చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన పిల్లల కోసం పెద్దాపురంలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ నవోదయ విద్యాలయం ఉచిత వసతితో కూడిన విద్యను అందిస్తున్న విషయం తెలిసిందే. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులకు ఉచిత విద్య వారి ఉన్నత శిఖరాలకు దోహదపడుతుంది. డిసెంబరు 13 నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈ నెల 13 వరకు దరఖాస్తులకు గడువు ఉంది. శ్యామ్ వద్ద శిక్షణ పొందిన వారిలో 9 మంది నవోదయకు ఎంపికయ్యారు.

పేకాట స్థావరాలపై ఆకస్మిక దాడి

అమలాపురం టౌన్: పట్టణంలో రెండు చోట్ల పేకాట స్థావరాలపై పోలీసులు ఆదివారం సాయంత్రం ఆకస్మిక దాడులు చేసి 10 మంది జూదరులను అరెస్ట్ చేశారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద గల ఒక లాడ్జిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక శ్రీరామనగర్ వద్ద పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.12 వేల నగదు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అమ్మపాలు.. అమృతం



- 7 వరకూ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు
- శిశువు పుట్టిన అరగంటలోపే తల్లిపాలు పట్టించాలి
- తల్లిపాల ప్రాధాన్యంపై గ్రామాల్లో అవగాహన



అవిడిలో అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీదివ్య

కొత్తపేట: అమ్మపాలు అమృతమంటారు... బిడ్డపుట్టిన క్షణం నుంచి ముర్రుపాలు పట్టడం శ్రేయస్కరం.. తల్లిపాలతో బిడ్డకు ఆకలి తీరడమే కాకుండా వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది.. అమ్మపాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించ దానికి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బందితో కలసి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు

ఐసీడీఎస్ ప్రాజెక్టు	గర్భిణులు	బాలింతలు	6 నెలల లోపు చిన్నారులు	మూడేళ్లలోపు చిన్నారులు
కొత్తపేట	1,465	1,000	899	6,985
పి.గన్నవరం	1,113	839	799	6,110
రాజోలు	908	661	602	5,193
మొత్తం	3,486	2,500	2,300	18,288

తల్లిపాలతో ఎన్నో ఉపయోగాలు..

- మొదటి ఆరు నెలలు ఎలాంటి డబ్బా పాలు పట్టించకుండా, తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి.
- సాధారణ ప్రసవం అయితే పుట్టిన అరగంట లోపు తల్లిపాలు పట్టించాలి. సిజేరియన్ అయితే నాలుగు గంటల లోపు ఇవ్వాలి.
- తల్లి పాలు వ్యాధి నిరోధక శక్తిని కూడా పెంపొందిస్తాయి.
- తల్లి పాలు మెదడు ఎదుగుదలకు దోహదం చేయడంతో పాటు జ్ఞాపకశక్తి పెంపొందుతుంది.
- బిడ్డకు పాలిచ్చే మహిళలకు బ్రెస్ట్ కేన్సర్, అండాశయ కేన్సర్, రక్తహీనత, ఎముకల బలహీనత వంటి జబ్బుల నుంచి రక్షణ పొందే అవకాశం ఉంది.
- ముర్రుపాలు వ్యాధి నిరోధక శక్తి పెంచడంతో పాటు, శిశువు జీర్ణాశయ అభివృద్ధికి దోహదపడే పదార్థాలు విటమిన్-ఏ అధిక మోతాదులో ఉంటాయి.
- తల్లిపాలలో సహజ సిద్ధమైన ప్రొటీన్లు, లాక్టోఫెరిన్, కోలోస్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియా ఉంటాయి.
- పసిబిడ్డకు ప్రధాన శత్రువు చలి, బిడ్డను ఒడిలో ఉంచుకొని పాలివ్వడం ద్వారా తల్లి శరీరం నుంచి శిశువుకు అవసరమైన వేడి అందుతుంది. తల్లీ-బిడ్డకు మధ్య అనుబంధం కూడా బాగా పెరుగుతుంది.

ముర్రుపాలు .. వ్యాధి నిరోధక టీకా



బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లిపాలు తాగించాలి. ఇది తల్లి స్వయంగా బిడ్డకు ఇచ్చే మొదటి వ్యాధి నిరోధక టీకా. ఆ తర్వాత బిడ్డకు ఆరు నెలలు నిండే వరకూ తల్లిపాలే పట్టాలి. ఎండాకాలమైనా సరే చుక్క నీరు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. తల్లిపాలు ఆరోగ్యకర జీవితానికి పోషణ పద్ధతి. అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషణ్ కిట్లతో పాటు మధువైన, సులువుగా జీర్ణమయ్యే పదార్థాలు సమయానుసారంగా పెంచుతూ బిడ్డకు రెండేళ్ల వరకు తల్లి పాలతో పాటు ఇవ్వాలి.

– ఎ.గజలక్ష్మి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, కొత్తపేట

అపోహలు మానుకోవాలి



బిడ్డ పుట్టిన అరగంట లోపు తల్లి ముర్రుపాలు పట్టించాలి. బిడ్డ పుట్టిన వెంటనే అరంగంట లోపు కచ్చితంగా ముర్రుపాలు తాగిస్తే తల్లీ, బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారు. శిశుమరణాల సంఖ్య కూడా తగ్గుతుంది. తల్లిపాలు తాగిన పిల్లలు చురుగ్గా, తెలివితేటలతో ఉంటారు. తల్లి పాలు పట్టడంలో లేనిపోని అపోహలు మానుకోవాలి. బిడ్డకు పాలిచ్చే తల్లుల్లో బ్రెస్ట్ కేన్సర్ వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయనేది కూడా అధ్యయనాల్లో తేలింది.

– వి.ప్రదీప్తికరుణ, గైనకాలజిస్టు, కొత్తపేట

హామీలు అమలయ్యే వరకూ పోరాటం



ఆర్.ఏనుగుపల్లిలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు
- పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ

పి.గన్నవరం: ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకూ కూటమి ప్రభుత్వంపై ప్రజల తరఫున పోరాటం సాగిస్తామని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ ఆధ్వర్యంలో ఆర్.ఏనుగుపల్లి, కె.ముంజవరం, ముంగండ, ముంగండపాలెం గ్రామాల్లో ఆదివారం ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు కడలి దుర్గాప్రసాద్, విప్పర్తి సత్యనారాయణ, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, కుడుపూడి నాగార్జునరావుల పర్యవేక్షణలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ, రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించారు. గన్నవరపు ప్రజలను కలుసుకుని చంద్రబాబు మోసాలను వివరించారు. జగన్ తన పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ఎన్నికల నాటి సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా చంద్రబాబు మోసం చేస్తున్నారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, సీనియర్ నాయకులు మందపాటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు పాలనతో విసుగు చెందిన ప్రజలు జగన్‌కు మద్దతు పలుకుతున్నారని అన్నారు. కె.ముంజవరంలో కుంపట్ల గోపి నివాసం వద్ద క్యూఆర్ కోడ్‌లను ప్రదర్శించారు. సర్పంచ్ దొమ్మేటి పార్వతి, పార్టీ నాయకులు దొమ్మేటి వెంకట శివరామన్, యాంద్ర నాగేశ్వరరావు, పేరిచర్ల కుమార్‌రాజు, ఉలిశెట్టి బాబీ, దేశిరాజు సీతారామయ్య, కుసుమ వెంకటేశ్వరరావు, సరెళ్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

‘అన్నదాత సుఖీభవ’లో కూటమి పక్షపాతం

పి.గన్నవరం: అన్నదాత సుఖీభవ పథకం అమలులో కూటమి ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబించిందని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆరోపించారు. ముంగండలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నేతలకు సంబంధించిన రైతులకు మాత్రమే పథకాన్ని అమలు చేశారని, చాలా మంది రైతులకు అన్యాయం జరిగిందని అన్నారు. ఈ పథకం కింద రైతులకు అరకొరగా మాత్రమే సొమ్ము వేస్తున్నారని విమర్శించారు. ప్రతి రైతుకు సాయం అందేవరకూ ప్రభుత్వంపై పోరాటం సాగిస్తామన్నారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక మాటున కూటమి నాయకులు రూ.వేల కోట్లు దోచుకున్నారన్నారు. చంద్రబాబు రాష్ట్రానికి సంపద సృష్టిస్తానని చెబితే ప్రజలు నిజమేనని అనుకున్నారని, తీరా చూసేసరికి ఆ సంపదను కూటమి నాయకులకే సృష్టించారని విమర్శించారు. కూటమి నేతలు ఎక్కడికక్కడ ఇసుకను డంపింగ్ చేసి, గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కువ రేట్లకు అమ్ముకుంటూ ప్రజలను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలు అమలు చేసేవరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని గన్నవరపు అన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్, నాయకులు మందపాటి కిరణ్ కుమార్, వాసంశెట్టి తాతాజీ, పితాని నర్సింహారావు, కుసుమ వెంకటేశ్వరరావు, బొక్కా ఏడుకొండలు, ఉలిశెట్టి బాబీ, సాయిబాబు, దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు



మాచవరం డైలీ మార్కెట్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన షాపింగ్ కాంప్లెక్స్, చేపల షెడ్లులు

అంబాజీపేట: మాచవరం పంచాయతీ పరిధి డైలీ మార్కెట్‌లో రూ.లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, చేపల విక్రయాల షెడ్‌ల అరకొరగా నిర్మించడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. 2018లో డైలీ మార్కెట్‌లో చేపలు, మాంసం, కూరగాయల విక్రయాలకు పంచాయతీ నిధుల నుంచి లక్షలాది రూపాయలు వెచ్చించి చేపల షెడ్డు, మాంసం విక్రయాలకు షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించారు. అయితే వాటిని అసంపూర్తిగా నిర్మించి అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు గాలికొదిలేశారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. భవన నిర్మాణాలకు ఉపయోగించే సుమారు 50 బస్తాల సిమెంట్ శిథిలమైపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రతి రెండేళ్లకోసారి పన్నులు వసూలు చేసుకునేందుకు వేలం పాటలు నిర్వహిస్తున్నారే తప్ప మార్కెట్‌లో కావల్సిన మౌలిక వసతుల కల్పనకు పంచాయతీ పాలకవర్గం దృష్టి సారించడం లేదని వాపోయారు. చీకటి పడితే విద్యుత్ దీపాలు ఉండవని విక్రయదారులు వాపోయారు. చేపల షెడ్డులో మురిగునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. షాపింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో మాంసం విక్రయాదారులు ఆరుబయట వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం, అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించడంతో పాటు వినియోగంలోకి తీసుకురావాలని పలువురు వ్యాపారులు, స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి ఇంటింటికీ వంచన



ఇంటింటికీ వంచన కరపత్రాలను విడుదల చేసిన మాజీ మంత్రి గొల్లపల్లి

మలికిపురం: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాల్లో భాగంగా రాజోలు నియోజకవర్గంలో సఖినేటిపల్లి మండలం అంతర్వేది నుంచి సోమవారం నుంచి ఇంటింటికీ వంచన పేరుతో ఆందోళన కార్యక్రమాలు ప్రారంభమవుతాయని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం మలికిపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఇంటింటికీ వంచన షెడ్యూల్ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని అప్రతిష్ట పాలు చేసి పార్టీ నాయకులను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అండ్ కో పని చేస్తుందని దుయ్యబట్టారు. ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వం ఏదో ప్రజలకు అర్థం అవుతుందని ఈ కూటమి ప్రగల్భాలు వినే స్థితిలో ప్రజలు లేరన్నారు. సమావేశంలో కుసుమ చంద్రశేఖర్, ఈద రవిరెడ్డి, మోకా సురేష్, జిల్లెల్ల ఉదయ్‌కిరణ్, తాడి సహదేవ్, గుర్రం రాజు, కారుపర్తి భాస్కర్, నల్లి రక్షణ, పెదపాటి నాగ లక్ష్మి, చింత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శలు



కె.ముంజవరంలో కుంపట్లను పరామర్శిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు, మాజీ ఎమ్మెల్యే పాముల



అంతర్వేదికరలో ఆంజనేయులును పరామర్శిస్తున్న గొల్లపల్లి

పి.గన్నవరం: ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్న కె.ముంజవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, సొసైటీ మాజీ చైర్మన్ కుంపట్ల గోవిందరావును నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గోవిందరావును పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు ఉన్నారు.

గొల్లపల్లి పరామర్శ

సఖినేటిపల్లి: అంతర్వేది కర గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు రావి ఆంజనేయులును ఆదివారం ఆ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. స్వల్ప అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయన యోగ క్షేమాలను గొల్లపల్లి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో జిమ్ నిర్వాహకుడి మృతి



కత్తుల శ్రీనివాసరావు (ఫైల్)

పి.గన్నవరం: ముంగండ గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిమ్ నిర్వాహకుడు కత్తుల శ్రీనివాసరావు (35) మృతి చెందాడు. మోటారు సైకిల్‌పై వెళ్తున్న శ్రీనివాసరావుకు కుక్క అడ్డు రావడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వై.కొత్తపల్లికి చెందిన శ్రీనివాసరావు పోతవరంలో ఎస్ఎస్ ఫిట్‌నెస్ జోన్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఆయన ముంగండ నుంచి కె.ముంజవరం రోడ్డు మీదుగా బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ముంగండ ముత్యాలమ్మ వారి గుడి దాటిన తర్వాత కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన శ్రీనివాసరావును అమలాపురం కిమ్స్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గంమధ్యలో మృతి చెందాడు. అతనికి భార్య సత్య దివ్యమణి, కవలలు పాప అమృత, బాబు ఆర్యన్ ఉన్నారు. శ్రీనివాసరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. భార్య, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. అతడి మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సన్‌డే

ఎండ, ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి



పుల్లేటికుర్రులో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

అంబాజీపేట/కొత్తపేట: సాధారణంగా ఆగస్టు నెలలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుంటాయి. కాని ప్రస్తుతం తీవ్రమైన ఎండ, ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవి ముగిసిపోయి.. రుతుపవనాలు రాష్ట్రంలోకి వచ్చి రెండు నెలలు దాటేస్తుంది. వర్షాకాలం ప్రవేశించి దాదాపు నెల రోజులు కావస్తున్నా పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గంలోని 11 మండలాల్లో పెద్దగా వానలు పడిన దాఖలాలు లేవు. సాయంత్ర సమయంలో అడపాదడపా వానలు పడినా వర్షాకాలం ప్రభావం కనిపించలేదు. అయితే వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదవడంతో ఎండలకు ప్రజలను ఠారెత్తిస్తున్నాయి. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉండటంతో మరోసారి వేసవి వచ్చిందని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సాధారణంగా వేసవికాలం, వర్షాకాలం, శీతాకాలం చెరో నాలుగు నెలలు ఉంటుంది. అయితే ఈ ఏడాది వానాకాలం నెల రోజుల్లోనే వెళ్లిపోయిందా అనే అనుమానాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం వచ్చినా ఏసీలు, ఫ్రిజ్‌ల వినియోగంలో ఎటువంటి మార్పు రాలేదని, కూలింగ్ వాటర్ కోసం వెంపర్లాడాల్సి వస్తుంది. కాసేపు బయటకు వెళితే ఎండ దెబ్బకు ఎప్పుడు ఏసీలోకి, చల్లని ప్రాంతానికి వెళదామా అనే ఆలోచన వస్తోందంటున్నారు. వేసవి ముగిసిన తరువాత గత వారం రోజులుగా అంబాజీపేట మండలంలో 38 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నాయి. దీంతో ఇప్పుడప్పుడే వాతావరణం చల్లబడే పరిస్థితి కనపించడం లేదనే భావన ప్రజలకు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విపరీతమైన ఎండలు కాస్తుండగా సాయంత్రం వాతావరణంలో కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి. ఏ క్షణాన అయిన కుండపోతగా వర్షం కురుస్తుందన్నట్లుగా దట్టమైన మబ్బులు పట్టడం కొంత సేపటకి మబ్బులు మాయమై ఉసూరుమనిపిస్తుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో మధ్యాహ్నం 12 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.



కొత్తపేటలో నిర్మానుష్యంగా ప్రధాన రోడ్డు

రోడ్డుకు అడ్డుగా విద్యుత్ స్తంభం



రోడ్డు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం

ఆలమూరు: మండలంలోని సందిపూడిలో రోడ్డుకు మధ్యలో పూర్వం ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభం ప్రస్తుతం సిమెంట్ రోడ్డుకు అడ్డంగా ఉంది. దీనివల్ల స్థానిక తోరాటి వారి వీధి వెంబడి ప్రయాణించే పాదచారులకు, ద్విచక్ర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యుత్ తీగలు చిందర వందరగా ఉండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ సత్వరమే స్పందించి విద్యుత్ స్తంభాన్ని సురక్షిత ప్రదేశంలోకి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారిని నిర్మించండి



గంగలకుర్రు మెట్లకాలనీలో అధ్వానంగా ఉన్న రహదారి

అంబాజీపేట: గంగలకుర్రు మెట్లకాలనీకి వెళ్లే ప్రధాన రహదారి బురదతో అధ్వానంగా తయారైందని తక్షణమే నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కొద్దిపాటి వర్షానికే రహదారి బురదతో నడిచేందుకు వీలు లేకుండా పోయిందని స్థానికులు వాపోయారు. కాలనీలో కొంత మేర సీసీ రోడ్డును నిర్మించి సుమారు 200 మీటర్లు ఉన్న రహదారిని నిర్మించకుండా గాలికి వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. ఈ రహదారిలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, వ్యవసాయోత్పత్తులు తీసుకువెళ్లే రైతులు, కూలీలు ప్రయాణిస్తూ ఉంటారు. ఈ దారిలో గుంతలు ఉండటంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని నిర్మించాలని కోరుతున్నారు.

పర్యావరణ పరిహార నిధుల సద్వినియోగం



దిండిలో వాటర్ ట్యాంకు ప్రారంభించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: ఎన్జీటీ ద్వారా అందిన పర్యావరణ పరిహార నిధులను గ్రామాలు సద్వినియోగం చేసుకున్నాయని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం మండలం దిండి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మంజూరు చేసిన పర్యావరణ పరిహార నిధుల రూ.43.10 లక్షలతో నిర్మించిన 40 వేల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి వాటర్ ట్యాంక్‌ను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏడాదిగా రాజోలులో అనేక వాటర్ ట్యాంక్‌లు నిర్మించుకున్నామని తద్వారా అన్ని గ్రామాలకీ పూర్తి స్థాయిలో మంచి నీరు ఇవ్వగలుగుతున్నామని అన్నారు. ఇంకా చాలా వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం అవసరం ఉందని వాటిని కూడా త్వరలో పూర్తి చేసుకుందామన్నారు. ఎన్జీటీ ద్వారా నిధులు రావడానికి కారకుడైన యెనుముల వెంకటపతిరాజుకి ధన్యవాదాలు తెలియజేశారు. దిండి గ్రామంలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొని రావాలని వాటికి సత్వర పరిష్కారం చూపుతానని తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, యెనుముల వెంకటపతిరాజు, మల్లిపూడి సత్తిబాబు, గోనిపాటి రాజు, కానేటి శ్రీధర్ పాల్గొన్నారు.